

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ సాక్షిగా తాండూరు నేతల మధ్య మరోమారు మాటల తూటాలు పేలాయి. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగింది. ఈ నేపథ్యంలో తాండూరు నేతల మధ్య విభేధాలు బయటపడ్డాయి. మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఒక దశలో చూసుకుందాం .. తేల్చుకుందాం అంటూ హెచ్చరికలు చేసుకున్నారు. అలాగే ఇతర అసెంబ్లీ నియోజక వర్గాల నేతల్లో విభేదాలు ఉన్నప్పటికీ అవి బయటకు పొక్కలేదు.

బీఆర్ఎస్‌లో తాండూరు రచ్చ

తెలంగాణ భవన్ సాక్షిగా మరోసారి భగ్గుమన్న విభేదాలు!

- పట్నం, పైలెట్ మధ్య మాటల యుద్ధం
- మిగతా నియోజకవర్గాల్లో నివురుగప్పిన నిప్పులా...
- చేవెళ్ల పార్లమెంట్ నేతలతో హరీష్ సమావేశం
- అసమ్మతి నేతలకు అందని ఆహ్వానం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/తాండూరు) జనవరి 5 : పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న వేళ బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. తెలంగాణ భవన్ సాక్షిగా నేతల మధ్య మాటలు తూటాలు పేలాయి. నువ్వెంత అంటే నువ్వెంత అనే రీతిలో ఒకరిపై మరొకరు దూసుకెళ్లారు. చూసుకుందాం ...రా... తేల్చుకుందాం రా అంటూ పరస్పరం సవాళ్లు విసురుకున్నారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో బీఆర్ఎస్‌లో గ్రూపు వివాదాలు భగ్గుమన్నాయి. తాండూరు నేతల మధ్య వివాదాలు మరోసారి బయటపడ్డాయి. మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అలాగే ఇతర అసెంబ్లీ నియోజకవర్గాల నేతల్లో విభేదాలు ఉన్నప్పటికీ బయటకు పొక్కలేదు. తాండూరు నేతల మధ్య ఘర్షణతో ఇతర నియోజకవర్గ నేతలెవ్వరూ మాట్లడకూడదని కట్టడి చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యేలు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమ వ్యతిరేక వర్గీయులకు సమావేశానికి ఆహ్వానించలేదు. లేదంటే ఇంకా పెద్ద ఎత్తున సమావేశంలో గొడవలు జరిగేవి. వాస్తవానికి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌లో లుకలుకలున్నాయి. గతంలో అధికారంలో ఉండడంతో ఇవి ఎక్కడా పెద్దగా బయటకు పొక్కలేదు. ఒకటి రెండు నియోజకవర్గాల్లో మాత్రం నేతల మధ్య వివాదాలు జరిగాయి. ఎన్నికల అనంతరం బీఆర్ఎస్‌లో వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి.

తెలంగాణ భవన్‌లో..

తాజాగా జరిగిన చేవెళ్ల పార్లమెంట్ స్థాయి సమావేశంలో మాజీ మంత్రి ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిల మధ్య వర్గపోరు మళ్లీ బయటపడింది. మాజీ మంత్రులు హరీష్‌రావు, సబితారెడ్డి, సీనియర్ నేతలు కేశవరావు, కడియం శ్రీహరి, మధుసూదనాచారి తదితరులు సమక్షంలో తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ సమావేశంలో మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి ప్రసంగిస్తుండగా మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వర్గానికి చెందిన ఇంతియాజ్, శ్రీనివాస్‌చారి అడ్డుకున్నారు. మీరు ,మీ భార్య సునీతారెడ్డి కలిసి రోహిత్‌రెడ్డిని ఓడించారని, కుట్రకు తెరలేపి పార్టీని భ్రష్టు పట్టించారంటూ మహేందర్‌రెడ్డి ప్రసంగాన్ని అడ్డుకున్నారు. వేదికపై ఉన్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కూడా మహేందర్‌రెడ్డిపై ఆగ్రహంతో ఊగిపోయారు. మహేందర్‌రెడ్డి సైతం రోహిత్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. ఒక దశలో ఇద్దరు కూడా చూసుకుందాం అంటే తేల్చుకుందాం.. అంటూ పరస్పరం హెచ్చరికలు చేసుకున్నారు. మహేందర్‌రెడ్డి సోదరుడు కుమారుడు షాబాద్ జడ్పీటీసీ అవినాష్‌రెడ్డి వేదికపైన రోహిత్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. ఇరువర్గాలకు మాజీ మంత్రి హరీష్‌రావు సర్ది చెప్పారు. ఇలాగైతే బయటికి చెడు సంకేతాలు వెళతాయని హరీష్‌రావు ఇరువర్గాలను వారించారు. ఎన్నికల ముందు పార్టీ ఆదేశాల మేరకు మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వర్గ విభేదాలన్నీ పక్కన పెట్టి మళ్లీ కలిసి పోయారు. రోహిత్‌రెడ్డి తనకు టికెట్ ప్రకటించగానే ముందుగా మహేందర్‌రెడ్డి ఇంటికి వెళ్లి స్వీట్లు తినిపించారు ఇద్దరు కలిసి పోవడంతో కార్యకర్తలు, బీఆర్ఎస్ శ్రేణులు సంబరపడ్డారు. ఎన్నికల సమయంలో ఇద్దరు కలిసి ప్రచారం చేసినప్పటికీ వారి మనస్సులు మాత్రం కలవలేదు. ఎక్కువగా ఎడమోహం పెడమొహంగానే ఉన్నారు.

వారించిన హరీష్‌రావు

ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలకు ముందు పార్టీలో బయటపడుతున్న లుకలుకలు విజయవకాశాలను దెబ్బతీస్తాయని పార్టీ ముఖ్యనేతలు ఆందోళనతో ఉన్నారు. ఇప్పటికే చేవెళ్ల పార్లమెంట్ టిక్కెట్ మళ్లీ సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. ఈ విషయాన్ని రంజిత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. అయితే ఇప్పుడు నేతల మధ్య బయటపడుతున్న విభేదాలు పార్టీ నాయకత్వాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. తాండూరు కాకుండా మిగతా అన్ని నియోజకవర్గాల్లో కూడా నేతల మధ్య విభేదాలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. ఇప్పటికే నగర శివార్లకు చెందిన కొందరు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్ వైపు వెళ్లేందుకు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. సిట్టింగ్ ఎమ్మెల్యేలతో కొందరు నేతలకు అసలు పొసగడం లేదు. వీరంతా ఇప్పుడు కాంగ్రెస్ వైపు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.


ముగ్గుల పోటీకి సిద్ధమవుతున్న కేఎన్ గార్డెన్

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆధ్వర్యంలో..

రేపు ముత్యాల ముగ్గుల పోటీ

- కేఎన్ గార్డెన్‌లో నిర్వహణ

షాద్‌నగర్ అర్బన్, జనవరి 5: ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో ఆదివారం షాద్‌నగర్‌లో జిల్లాస్థాయి ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శతాబ్ది టౌన్‌షిప్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో ఈ పోటీలు షాద్‌నగర్ పరిగి రోడ్డులోని కేఎన్ గార్డెన్‌లో ఉదయం 9.00 గంటల నుంచి 11గంటల వరకు జరుగుతున్నాయి. రాష్ట్రస్థాయిలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీకి కెనరా బ్యాంక్, ఎయిమ్స్ విద్యాసంస్థలు బెంగుళూరు, రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతనలు సహకారం అదిస్తున్నాయి. షాద్‌నగర్‌లో నిర్వహించే ముగ్గుల పోటీలో పాల్గొనే విజేతలకు మొదటి బహుమతిగా రూ.ఆరువేలు, రెండో బహుమతిగా రూ.నాలుగు వేలు, మూడవ బహుమతిగా మూడు వేల రూపాయలు ఇవ్వనున్నారు. అలాగే మరో ముగ్గురికి ప్రత్యేక బహుమతులుంటాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, శతాబ్ది టౌన్‌షిప్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ కాసు శ్రీనివాస్‌రెడ్డిలు హాజరవుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. బహుమతి ప్రదాన కార్యక్రమానికి హాజరు కావాలని ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ప్రతినిధులు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి ఆహ్వానించారు.


ముగ్గుల పోటీ బహుమతుల ప్రదానోత్సవానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఆహ్వానిస్తున్న ఆంధ్రజ్యోతి జర్నలిస్టులు


మహిళా ప్రయాణికులతో మాట్లాడుతున్న సునీతారావు

ఆరు గ్యారంటీలనూ అమలు చేస్తాం

- మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు

ఇబ్రహీంపట్నం, జనవరి 5 : కాంగ్రెస్ పార్టీ ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలనూ ఖచ్చితంగా అమలు చేస్తుందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం బస్టాండ్‌లో మహిళా ప్రయాణికులతో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత ప్రయాణం పట్ల వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో ఒక్కటైన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని అన్నారు. ప్రజలు వారికి త్వరలో తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణంపై రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు, విద్యార్థినుల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి మహిళా లోకం నుంచి వస్తున్న ఆదరణకు బయపడి బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఆటోడ్రైవర్లను ఉసిగొల్పుతున్నారని, ఇది మంచి పద్దతి కాదని హితవు పలికారు. ఆటోడ్రైవర్ల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచిస్తుందని, వారికి సంవత్సరానికి రూ.12,000 ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, నాయకురాళ్లు సదాలక్ష్మి, కవిత, ఉషశ్రీ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న చలి..

- తాళ్లపల్లిలో 13.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

రంగారెడ్డి అర్బన్, జనవరి 5 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చలి చంపేస్తోంది. రాత్రివేళలో ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. దాంతో చలి తీవ్రత పెరుగుతోంది. శుక్రవారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం తాళ్లపల్లిలో 13.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం నాగారం, తొర్మామిడి గ్రామాల్లో 14.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బండ్లగూడలో 15.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శశాంక

'ఈ-ఆఫీస్'తో కార్యకలాపాలు చేపట్టాలి

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జనవరి 5 : ప్రతీ శాఖలో 'ఈ-ఆఫీస్' ద్వారా కార్యకలాపాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శశాంక సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని, కార్యాలయాల్లో ఫైల్స్‌ను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


పెద్దగోల్కొండలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దు

శంషాబాద్ రూరల్ : ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక సూచించారు. శంషాబాద్ మండల పరిధిలోని పెద్దగోల్కొండలో జరిగిన ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ప్రజాపాలన కార్యక్రమం నిర్వహణపై సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో అన్ని దరఖాస్తులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు. కాగా, దరఖాస్తులు నింపడానికి ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో వసంతలక్ష్మి కలెక్టర్‌కు వివరించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.లక్ష్మయ్య, ఉపసర్పంచ్ స్వరూపగౌడ్, వార్డుసభ్యులు, గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.

డాటా ఎంట్రీలో తప్పులు దొర్లొద్దు

» జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 5: ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల వివరాలను ఎలాంటి తప్పులు దొరలకుండా వెబ్‌సైట్ లో నమోదు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కంప్యూటర్ ఆపరేటర్లకు ప్రజాపాలన దరఖాస్తుల డాటాఎంట్రీ నమోదుపై ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రజా పాలన దరఖాస్తులను వెబ్‌సైట్ లో నమోదు చేసేందుకు 57 టీంలను ఏర్పాటుచేయడం జరిగిందని, ప్రతి టీంలో 20 మంది కంప్యూటర్ ఆపరేటర్లు ఉంటారన్నారు. అన్ని మండల కేంద్రాలలో సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతిరోజు రెండు షిఫ్టులలో 10 మంది చొప్పున డాటా ఎంట్రీ చేయాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా పనులు చేపట్టాలని, ఒక్క టీం ప్రతి రోజు వేయి దరఖాస్తులను అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులన్నింటినీ ఈనెల 17 వరకు పూర్తి చేయాలని సూచించారు. ఆధార్, రేషన్‌కార్డు, సెల్ నంబర్లను పూర్తి జాగ్రత్తతో తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. దరఖాస్తు నమోదు చేసిన తర్వాత వచ్చే యూనిక్ నంబర్‌ను రెడ్ పెన్నుతో దరఖాస్తు పై భాగంల రాసి పై దరఖాస్తు చివరి భాగంలో ఎంట్రీ చేసిన ఆపరేటర్ పేరు సంతకం చేయాలని సూచించారు. ఈ డాటా ఆధారంగానే లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం డాటా ఎంట్రీ ఆపరేటర్ల సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, డీపీవో తరుణ్‌కుమార్, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.


అక్రమంగా నిల్వ ఉంచిన సిలిండర్లతో టాస్క్‌ఫోర్స్ అధికారులు

అక్రమంగా నిల్వ ఉంచిన డొమెస్టిక్ సిలిండర్ల స్వాధీనం

వికారాబాద్, జనవరి 5: వికారాబాద్‌లో గల కన్య లాల్బాగ్ కాలనీలో కొత్తపల్లి చంద్రారెడ్డి అనే వ్యక్తి ఇంట్లో సబ్సిడీ డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ ఉంచుకొని అధిక ధరకు విక్రయిస్తున్నాడు. విషయం తెలుసుకున్న వికారాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి ఎస్‌ఐ ప్రశాంత్‌వర్ధన్, ఆయన బృందం, స్థానిక పోలీసులు ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. 38 డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని వికారాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


పరిగి శివారులో ఇజ్తిమా సభలు నిర్వహించే ప్రాంగణం

నేటి నుంచి ఇజ్తిమా సభలు

» పరిగిలో మూడు రోజుల పాటు నిర్వహణ

» 3-5 లక్షల మంది ముస్లింలు వచ్చే చాన్స్

పరిగి, జనవరి 5: తబ్లీగీ జమాత్ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా పరిగిలో నిర్వహించే సుబాఈ దీనీ ఇజ్తిమా సభలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరిగి మునిసిపాలిటీ శివారులోని న్యామత్‌నగర్‌లో మూడు రోజుల పాటు జరిగే ఈ సభలకు 3-5 లక్షల వరకు ముస్లింలు హాజరవ్వుతారని అంచనా వేస్తున్నారు. దాదాపు 300 ఎకరాల స్థలంలో 5 లక్షల మందికిపైగా కూర్చునే విధంగా ఏర్పాట్లు చేశారు. తెలంగాణ, ఏపీ, కర్ణాటకృతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల వారు హాజరు కానున్నారు. భోజన వస్త్సతుల కోసం ప్రత్యేకంగా 26 వంట శాలలను ఏర్పాటు చేశారు. నీటి వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలలను కూడా ఏర్పాటు చేశారు. ఇజ్తిమా నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.2.45 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారు జిల్లాలు, ప్రాంతాల వారీగా కూర్చునే విధంగా బోర్డులు ఏర్పాటు చేశారు. పార్కింగ్ కోసం వంద ఎకరాల వరకు జిల్లాల వారీగా ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం నుంచే ఇజ్తిమా సభల కోసం జనం తరల్వివస్తున్నారు. ఎస్పీ కోటిరెడ్డి పర్యవేక్షణలో భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్లపై అవిశ్వాసం?

కలెక్టర్‌కు తీర్మానపత్రం సమర్పించిన అధికార, ప్రతిపక్ష సభ్యులు ● కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల మద్దతు


కొత్త ఆర్తీక, చైర్‌పర్సన్


కలెక్టర్ కార్యాలయంలో పిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ బీఆర్ఎస్ సభ్యులు

ఆదిభట్ల, జనవరి 5 : ఇబ్రహీంపట్నం మండలం ఆదిభట్ల మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధమైందా..? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్‌పర్సన్లపై అవిశ్వాసం దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. చైర్‌పర్సన్ కొత్త ఆర్థీక, వైస్ చైర్‌పర్సన్ కోరే కళమ్మలపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలంటూ శుక్రవారం ఆదిభట్ల మున్సిపాలిటీ కౌన్సిలర్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అధికార కాంగ్రెస్‌తోపాటు బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు సైతం మద్దతు ప్రకటించడంతో అవిశ్వాసం తీర్మానం ఖరారైనట్లు తెలుస్తోంది. కొత్తగా ఏర్పాటుచేసిన ఆదిభట్ల మున్సిపాలిటీకి జరిగిన ఎన్నికల్లో మొత్తం 15 మంది సభ్యులకు గాను కాంగ్రెస్ నుంచి ఎనిమిది మంది, బీఆర్ఎస్ నుంచి ఆరుగురు సభ్యులు బీజేపీ నుంచి ఒక సభ్యుడు గెలిచారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎనిమిది మందితో పాటు బీజేపీకి చెందిన మరో సభ్యుడు మద్దతు ప్రకటించినప్పటికీ కాంగ్రెస్ నుంచి ఎంపికైన కొత్త ఆర్థీకను నాటి అధికార టీఆర్ఎస్ పార్టీలోకి తీసుకొని ఎక్స్ అఫీషియో సభ్యుల సహకారంతో చైర్‌పర్సన్‌ను చేసింది. అప్పటి నుంచి మున్సిపాలిటీలో ఆధిపత్య పోరు నిత్యం జరుగుతూనే ఉంది. గతంలో జరిగిన పరిణామాలతో చైర్‌పర్సన్ ఆర్థీక బీఆర్ఎస్‌ని వీడి మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరారు. చైర్‌పర్సన్ భర్త, కుటుంబ సభ్యులు అన్ని విషయాల్లో జోక్యం చేసుకుంటుండడం, కాంగ్రెస్‌లో చేరినప్పటికీ ఆ పార్టీ కార్యకర్తలతో గానీ ఇతర సభ్యులతో గానీ సఖ్యతగా మెలగలేకపోవడం, అటు బీఆర్ఎస్‌లో ఇమడలేక మళ్లీ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నప్పటికీ పార్టీకి దగ్గర కాలేకపోయింది. బీఆర్ఎస్ అధికారం కోల్పోయి కాంగ్రెస్ అధికారంలోకి రావడం, స్థానికంగా పార్టీ ఎమ్మెల్యే ఉండటంతో పార్టీ నుంచి చైర్మన్‌ను ఎంపిక చేసే అవకాశాలున్నాయని చెప్పుకోవచ్చు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అవిశ్వాసం లాంఛనమే అని తేలిపోయింది.

కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు క్షమించరు



మేడ్చల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తొమ్మిదన్నరేళ్లుగా రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ ప్రజలు ఎన్నటికీ క్షమించరని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కల్తీ పాలవలే నియోజకవర్గాన్ని కల్తీమయం చేస్తున్న మల్లారెడ్డిపై దమ్ముంటే కేటీఆర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హామీలను 420 హామీలని కేటీఆర్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చి నెల రోజులు కూడా పూర్తి కాకుండానే కేటీఆర్ విమర్శలు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రజలు కర్రు కాల్చి వాతలు పెట్టినా ఇంకా బుద్ధి రాలేదని విమర్శించారు. మాజీ మంత్రి మల్లారెడ్డి చెరువు స్థలాలు కబ్జాలు చేస్తూ అవినీతిమయం చేశాడని, మున్సిపల్ ఎన్నికల్లో రూ.500 కోట్లు టికెట్లు అమ్ముకున్నాడని ఆయన ఆరోపించాడు. ఆయన అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చి ప్రజల ముందు నిరూపిస్తామన్నారు.



కొర్రెముల జిల్లా పాఠశాలలో నిర్వహించిన కెరీర్ గైడెన్స్ పాల్గొన్న అనురాగ్ యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు

విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 5: విద్యార్థులు పాఠశాల స్థాయినుంచే క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని అనురాగ్ యూనివర్సిటీ ప్రోగ్రాం ఆఫీసర్ మధుకర్ తెలిపారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కొర్రెముల జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్ వంటి పోటీపరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ అధ్యాపకులు తృప్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, హెచ్ఎం వరలక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మతి తప్పి మాట్లాడుతున్న సబితారెడ్డి

» డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



రంగారెడ్డి అర్బన్, జనవరి 5 : మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మతి తప్పి మాట్లాడుతున్నారని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి కనీసం నెల కూడా కాలేదని, అప్పుడే కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం ఎక్కడ? అని సబితారెడ్డి ప్రశ్నించడం చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుందన్నారు. ఐదేళ్ల పాలనలో నువ్వు ఇస్తా అన్న దళిత బంధు, బీసీ బంధు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, కేజీ టూ పీజీ ఎక్కడ? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని, ఇప్పటికే ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. సబితారెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేసేముందు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల గురించి ఒక్కసారి ఆలోచించి మాట్లాడాలని చల్లా తెలిపారు.

మహేశ్వరం నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కమిటీలన్నీ రద్దు

మహేశ్వరం, జనవరి 5 : మహేశ్వరం నియోజకవర్గంలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ డివిజన్‌లలోని తమ పార్టీ కమిటీలను రద్దు చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం రాష్ట్ర పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సూచన మేరకు మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీకి సంబంధించిన అన్ని కమిటీలను తక్షణమే రద్దు చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ అనుమతి లేకుండా ఎవరైనా నేను ఫలానా అధ్యక్షున్ని అని ప్రచారం చేసుకునే వ్యక్తులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని అన్నారు. పార్టీ అధిష్ఠానం ఆదేశానుసారం పార్టీ కోసం పనిచేసేవారిని గుర్తించి త్వరలో తగిన ప్రాధాన్యతనిస్తూ కమిటీలు వేస్తామని ప్రకటించారు

కోర్టు ఆదేశాలతో రోడ్డుపై కంకర తొలగింపు


చెంగోల్‌లో బైపాస్ రోడ్డుపై వేసిన కంకరను తొలగించాలని డీఈ శ్రీనివాస్‌ను కోరుతున్న నయీంఅక్తర్

తాండూరు రూరల్, జనవరి 5: మండలంలోని చెంగోల్ గ్రామ శివారులో కొనసాగుతున్న బైపాస్ రోడ్డు పనులపై ఓ రైతు న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. కంకరను తొలగించేలా డీఈ శ్రీనివాస్‌ను కోరారు. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం రోడ్డుపై వేసిన కంకరను జేసీబీ సాయంతో తొలగించారు. భూయజమాని హబీబ్ సుల్తానా, ఆమె భర్త నయీంఅక్తర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెంగోల్ గ్రామ శివారులోని సర్వేనెంబర్-250, 248లో తమకు 24గుంటల పట్టా భూమి ఉందని తెలిపారు. ఇట్టి భూమిలో నుంచి బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం ఆర్అండ్‌బీ అధికారులు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే భూమిలో నుంచి రోడ్డు వేశారు. దీంతో అప్పట్లో అట్టి భూమిలో ఉన్న పాలిషింగ్ యూనిట్లను తొలగించడంతో పెద్ద ఎత్తున నష్టపోయినట్లు తెలిపారు. అయితే ఇట్టి విషయంపై రోడ్డును తొలగించాలని అధికారులను కోరినప్పటికీ పట్టించుకోలేదు. తమ భూమి నష్టపోతున్నామని 2023, ఆగస్టు లో న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు వారు తెలిపారు. తమకు న్యాయస్థానం అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో అట్టి రోడ్డును తాండూరు ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్ జేసీబీ సాయంతో శుక్రవారం తొలగించారు. అయితే 2017లో తమ భూమిలో ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండానే రోడ్డు వేశారని, దీంతో తాము కోర్టును ఆశ్రయించినట్లు బాధితులు తెలిపారు. 2017లో రోడ్డు వేయడం వల్ల పాలిషింగ్ మా భూమిలో ఉన్న పాలిషింగ్ యూనిట్లకు భారీగా నష్టం జరిగిందని వాపోయారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు తమ పొలం పక్క నుంచి అలైమెంట్ మార్చి రోడ్డు వేస్తే బాగుంటుందని కోరారు. ఈ విషయంపై తాండూరు ఆర్అండ్‌బీ డీఈ క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించారు. బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం 24గుంటల భూమిని తీసుకున్నది వాస్తవమేనని, అయితే బ్యాంకు అకౌంట్లు ఇవ్వకపోవడం, భూమికి సంబంధించిన సమగ్ర వివరాలు ఇవ్వకపోవడంతో వారికి పరిహారం అందలేదన్నారు. కొంతమందికి భూ వివరాలు సరిగ్గా లేనందున పరిహారం డబ్బులు ఇవ్వాల్సి ఉందని, త్వరలోనే వారందరికీ క్లియర్ చేస్తామని వివరించారు.

ఓటరు లిస్టులో పేర్లు నమోదు చేయించుకోవాలి

» చేవెళ్ల ఆర్డీవో సాయిరాం



చేవెళ్ల, జనవరి 5 : 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా పేరు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని చేవెళ్ల ఆర్డీవో సాయిరాం తెలిపారు. శుక్రవారం చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు జనవరి 6వతేదీ నుంచి 22వతేది వరకు ఓటరు లిస్టుల్లో మార్పులు, చేర్పులు, తొలగింపులకు అవకాశం ఉందన్నారు. కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాలనుకునే వారు ఆన్‌లైన్‌లోగాని, తహసీల్దార్ కార్యలయంలోగానీ, ఆర్డీవో కార్యాలంలోగానీ ఓటరుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 8న ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామన్నారు. రాబోయే పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఇదే ఓటరు లిస్టు పరిగణలోకి వస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

కమ్యూనిటీ ఆస్పత్రికి కేంద్ర ప్రభుత్వ గుర్తింపు


డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

షాద్‌నగర్, జనవరి 5 : కమ్యూనిటీ ఆస్పత్రికి కేంద్ర ప్రభుత్వ గుర్తింపు లభించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. గత ఏడాది నవంబర్‌లో నేషనల్ హెల్త్ సిస్టమ్ రిసోర్స్ సెంటర్ వైద్య బృందం కమ్యూనిటీ ఆస్పత్రిని సందర్శించింది. కమ్యూనిటీ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఏడు విభాగాల్లో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించింది. రోగులకు నాణ్యమైన వైద్య సేవలనందిస్తున్నందుకు కమ్యూనిటీ ఆసుపత్రికి నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్ (ఎన్‌క్యూఎస్) సర్టిఫికెట్‌ను ప్రదానం చేసింది. ఈ సర్టిఫికెట్ మూడేళ్ల పాటు ఆస్పత్రికి వర్తించడంతో పాటు, ఏడాదికి రూ. 5లక్షలు కేంద్రం నుంచి కేటాయిస్తారని డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తమ వైద్య సిబ్బంది అందిస్తున్న నిరంతర సేవలకు సర్టిఫికెట్ రావడం హర్షణీయమన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట


పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట, జనవరి 5 : కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కేశంపేట మండల కేంద్రంలో రూ. 77లక్షలతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు విద్యా శాఖ అధికారులతో చర్చిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజాపాలన’కు అపూర్వ స్పందన : వీర్లపల్లి

● అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ

కొత్తూర్, జనవరి 5: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తున్నదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీలోని ఎంఆర్‌సీ భవనం వద్ద నిర్వహిస్తున్న అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే సందర్శించి, సమస్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పథకాల కోసం ప్రజలు ఎదురు చూశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అటువంటివి జరగకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నదని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందజేసి మాట నిలబెట్టుకుంటామన్నారు. సిద్దాపూర్ అసైన్డ్ భూముల అవకతవకలపై స్పెషల్ కలెక్టర్ చేత విచారణ జరిపించేందుకు రెవెన్యూ మంత్రి పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు జె. వేణుగోపాల్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు జె. సుదర్శన్‌గౌడ్, జెనిగె జగన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జె. గోవర్ధన్‌గౌడ్, వీరమోని దేవేందర్, కర్రొళ్ల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.


కొత్తూర్ : ప్రజాపాలన కేంద్రాన్ని సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కాగా విద్యాభివృద్ధి కోసం రౌండ్‌టేబుల్ ఇండియా, లేడిస్ సర్కిల్ ఇండియా సేవా సంస్థ చేస్తున్న సేవలు అజరామరమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎస్‌సీ కాలనీలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో రౌండ్‌టేబుల్ ఆధ్వర్యంలో నిర్మించిన మూడు అదనపు గదులను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా రౌండ్‌టేబుల్ నిర్వహకులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో కిష్టారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్, వైస్‌ఛైర్మన్ డోలీ రవీందర్, కౌన్సిలర్లు ప్రసన్నలతయాదయ్య, మాదారం నర్సింహ్మగౌడ్, నాయకులు జె. శ్రీను, కమ్మరి జనార్ధన్‌చారి, మాజీ ఎంపీపీ జె. వేణుగోపాల్‌గౌడ్, మాజీ సర్పంచులు జె. సుదర్శన్‌గౌడ్, జెనిగె జగన్, ప్రధానోపాధ్యాయులు అంగుర్, ప్రతాప్‌రెడ్డి తదితరులున్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు/ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకట్రాములు అన్నారు. మండలంలోని 35 గ్రామాలలో నిర్వహించిన గ్రామ సభలలో శుక్రవారం 1172 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన చెప్పారు. అదేవిధంగా ప్రభుత్వ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శ్యామ్‌సుందర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డుల్లో ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని శుక్రవారం కమిషనర్ పరిశీలించారు. ఆరు గ్యారంటీల కోసం నేటివరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఆయన చెప్పారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లు : దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

డివైడర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


డివైడర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఆమనగల్లు, జనవరి 5: శ్రీశైలం నుంచి హైదారాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. శ్రీశైలం నుంచి హైదారాబాద్ వెళ్తున్న పికెట్ డిపోకు చెందిన టీఎస్ 09జడ్ 7819 నెంబర్ గల బస్సు గురువారం రాత్రి ఆమనగల్లు మున్సిపాలిటీ విఠాయిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌ను వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో డివైడర్‌పై ఉన్న సెంట్రల్ లైటింగ్ పోల్‌తో పాటు డివైడర్ గ్రిల్స్ విరిగిపోయాయి. దాంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సరుకులు సకాలంలో అందించాలి


రేషన్‌షాప్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ మంజుల

ఆమనగల్లు, జనవరి 5: సకాలంలో రేషన్ బియ్యం అందించాలని సర్పంచ్ కొప్పు మంజులయాదయ్య అన్నారు. పౌరసరఫరాల శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ షాప్‌ను శుక్రవారం డీలర్ అశోక్‌తో కలిసి సర్పంచ్ ప్రారంభించారు. డీలర్లు సకాలంలో సరుకులు పంపిణీ చేసి వినియోగదారుల అభిమానాన్ని చూరగొనాలని చెప్పారు. విఠాయిపల్లి రమేశ్, దరువుల శంకర్, గండి కోట శంకర్, రూపం వెంకట్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, కృష్ణయ్య, పర్వతాలు, లక్ష్మయ్య, బాల్‌రామ్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు మహేశ్వరానికి సబితా ఇంద్రారెడ్డి రాక

మహేశ్వం, జనవరి 5 : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులకు చెక్కులు అందజేయడానికి నేడు (శనివారం) మహేశ్వరానికి మాజీ మంత్రి ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి హాజరవుతున్నట్లు ఎంపీపీ ఆర్.సునిత తెలిపారు. మండల సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని తెలిపారు. అదేవిధంగా సబితారెడ్డి కందుకూరుకు రానున్నట్లు జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, తహసీల్దార్ కె.గోపాల్ తెలిపారు. మండలంలోని 35 గ్రామ పంచాయతీలకు చెందిన 108మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఉదయం 11:30గంటలకు మండల పరిషత్తు కార్యాలయంలో అందజేయనున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, సకాలంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

న్యాయవాదుల సంక్షేమానికి కృషి

● ఆమనగల్లు కోర్టుకు నూతన భవనాల నిర్మాణం
● కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, జనవరి 5: ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జీ కోర్టు కు అనువైన చోట అవసరమైన స్థలాన్ని కేటాయించి నూతన భవనాల నిర్మాణానికి కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మెరుగైన వసతులతో అధునాతన భవనాల నిర్మాణం చేపడుతామని చెప్పారు. ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే నారాయణరెడ్డికి అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే, జడ్పీ వైస్‌ఛైర్మన్ బాలాజీసింగ్‌ను సత్కరించి అభినందించారు. ప్రస్తుతం కోర్టును నిర్వహిస్తున్న భవనాలు పాతవి కావడంతో, స్థలాన్ని కేటాయించి నూతన భవనాలు నిర్మించాలని బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయ వాదులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. కోర్టు భవనాల నిర్మాణానికి చర్యలు చేపడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించి వీలైనంత త్వరగా కోర్టుకు కేటాయించేలా చూస్తానని హామి ఇచ్చారు. అప్పటివరకు ప్రస్తుతం ఉన్న భవనాలలో అవసరమైన వసతులను కల్పిస్తానని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమానికి తోడ్పాటునందిస్తుందని తెలిపారు. బార్ అసోసియేషన్ సభ్యులు న్యాయవ్యవస్థపై ప్రజలకు అవగాన కల్పించాలని కోరారు. పేదలకు ఉచితంగా న్యాయ సేవలు అందించాలని సూచించారు. చట్టాలు, న్యాయవ్యవస్థపై ప్రజలు అవగాహన కలిగి వుంటే సత్వర న్యాయం పొందే వీలుంటుందని తెలిపారు. న్యాయవాదులు పేదల పక్షాన నిలిచి సేవలందిస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.లక్ష్మణశర్మ, సీనియర్ న్యాయవాది వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు అండేకార్ యాదిలాల్, మల్లెపల్లి జగన్, ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు, ఏపీపీ కార్తీక్, న్యాయ వాదులు , బార్‌అసోసియేషన్ సభ్యులు వెంకట్ గౌడ్, జమీల్ ఖైమద్, రామకృష్ణ, శేఖర్, మధు, గణేశ్, దేవేందర్, సి. శ్రీనివాస్, వస్పుల మల్లేశ్, సంతోష్, నరేశ్, మల్లేశ్, మురళీ, సీఐలు వెంకటేశ్వర్లు, బద్యనాథ్ చౌహాన్, నాయకులు యాచారం వెంకటేశ్వర్లు గౌడ్, వస్పుల జంగయ్య, జగన్, కాలే మల్లయ్య, న్యాయవాదులు, తదితరులున్నారు.


ఎమ్మెల్యే నారాయణరెడ్డిని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సన్మానం

ఎమ్మెల్యే కసిరెడ్డిని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అభినందించారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆమనగల్లు సీడీపీవో సక్కుబాయి ఎమ్మెల్యేను సత్కరించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాల గురించి ఎమ్మెల్యేకు వివరించారు. పలు కేంద్రాలకు భవనాల నిర్మాణం గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జయమ్మ, సరళాదేవి, కవిత, మమత, తదితరులున్నారు. ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. ఎక్సైజ్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించాలని కోరారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భాగ్యమ్మ సేవలు మరువలేనివి

కొత్తూర్, జనవరి 5: ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ సేవలు మరువలేనివని కొత్తూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్ అన్నారు. బదిలీపై వెళుతున్న ప్రధానోపాధ్యాయురాలికి పాఠశాల ఆవరణలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఛైర్‌పర్సన్ పాల్గొని మాట్లాడుతూ హెచ్‌ఎంగా భాగ్యమ్మ పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విద్యార్థులకు ఎంతో క్రమశిక్షణతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేశారని గుర్తుచేశారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు పాటుపడ్డారని చెప్పారు. ప్రజాప్రతినిధులతో పాటు, మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ నాయకులు, విద్యార్థులు భాగ్యమ్మ సేవలను కొనియాడి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భాగ్యమ్మ భర్త ప్రముఖ న్యాయవాది అంజన్న, కౌన్సిలర్ మాదారం నర్సింహ్మగౌడ్, నాయకులు జె. శ్రీను, సుదర్శన్‌గౌడ్, విద్య కమిటీ ఛైర్మన్ కాంతమ్మ, మాజీ ఛైర్మన్ లక్ష్మయ్య, ప్రధానోపాధ్యాయులు అంగూర్, పీఆర్‌టీయూ నాయకులు చెన్నకేశవరెడ్డి, గోవర్ధన్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, విజయసాగర్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.


భాగ్యమ్మను సన్మానిస్తున్న ఛైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్, తదితరులు

బస్టాండ్‌లోకి బస్సులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం, జనవరి 5 : ‘బస్టాండ్‌లోకి బస్సులు రావా? ప్రయాణికుల గోడు పట్టదా’ అనే శీర్షికతో ఇటీవల ‘ఆంధ్రజ్యోతి’లో వచ్చిన కథనానికి ఆర్టీసీ ఉన్నతాధికారులు, పోలీసులు స్పందించారు. గురువారం సాయంత్రం నుంచి బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. యాచారం మండల కేంద్రంలో కోట్లాది రూపాయలతో నిర్మించిన బస్టాండ్ ఉన్నా అందులోకి బస్సులు రాకపోవడంతో సంఘ విద్రోహులకు అడ్డగా మారిన విషయం తెలిసిందే. ఇక నుంచి అంబేడ్కర్ విగ్రహం వద్ద బస్సులను ఆపితే ఆ యా డిపోల అధికారులకు పిర్యాదు చేయడంతో పాటు ఫైన్ విధించడం ఖాయమని ట్రాఫిక్ ఎస్సై వెంకటయ్య తెలిపారు. బస్టాండ్‌లో వసతులు కల్పించి ప్రయాణికులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటామని ఇబ్రహీంపట్నం డిపో అధికారులు చెప్పారు.


యాచారం బస్టాండ్‌లో నిలిచిన ఆర్టీసీ బస్సు

పేద కుటుంబాలకు అండగా ఉంటాం

మంచాల, జనవరి 5 : ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలను ఆదుకుంటామని బండలేమూర్ సర్పంచ్ పాత్‌లోత్ మంగ్రశ్రీనివాస్ అన్నారు. అజినాతండాకు చెందిన జర్పుల మోత్య(72) అనారోగ్యంతో మృతిచెందగా సర్పంచ్, వార్డుసభ్యులు జనార్ధన్, రవి తదితరులు శుక్రవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. పేదల కోసం సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని సర్పంచ్ చెప్పారు.

నందిగామ ఇన్‌స్పెక్టర్‌గా ప్రసాద్



నందిగామ, జనవరి5: నందిగామ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పి. ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నందిగామ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన సురేష్ బాలనగర్ పోలీస్‌స్టేషన్ ట్రాఫిక్ సీఐగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన పి. ప్రసాద్ బదిలీపై వచ్చారు. శుక్రవారం ప్రసాద్ చార్జ్ తీసుకున్నారు. అనంతరం నందిగామ పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఇన్‌స్పెక్టర్ సురేష్‌ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించాలి


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య

చౌదరిగూడ, జనవరి 5: గ్రామీణ స్థాయి క్రీడాకారులు క్రీడలతో పాటు చదువులో రాణించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్లలో గ్రామ సర్పంచ్ భూపాలచారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ నవీన్‌రెడ్డిలతో కలిసి మాజీ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో క్రీడాకారుల మధ్య స్నేహ సంబంధాలు పెరుగుతాయన్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్, డైరెక్టర్ జబ్బార్, ఎంపీటీసీ మంగమ్మ, శ్రీధర్‌రెడ్డి, సర్పంచులు బాబురావు, శివ, కొండి యాదయ్య, రాజు, చెన్నయ్య, యాదయ్య, ఆర్గనైజర్స్ గౌస్, అంజి, రవి, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల వితరణ


చేవెళ్ల : కౌకుంట్లలో అక్షింతలతో గ్రామస్తుల ర్యాలీ

చేవెళ్ల/షాబాద్, జనవరి 5 : రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు పిలుపు మేరకు అయోధ్య అక్షింతల కలశ వితరణ కార్యక్రమం శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి హనుమాన్ దేవాలయం వరకు అక్షింతలతో ర్యాలీ నిర్వహించారు. వివిధ గ్రామాల్లోని హనుమాన్ దేవాలయంలో పూజలు నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్షింతలను చేవెళ్ల, కౌకుంట్ల, మడికట్టు గ్రామాల్లో గడపగడపకు అందించారు. సర్పంచ్‌లు శైలజాఆగిరెడ్డి, నాయకులున్నారు. షాబాద్ మండలం రుద్రారం, లక్ష్మారావుగూడలో సర్పంచ్‌లు స్వర్ణలతసతీష్‌యాదవ్, అనితసత్తయ్యల ఆధ్వర్యంలో అక్షింతలను పంపిణీ చేశారు.

వీర్లపల్లి ఎమ్మెల్యేగా గెలిచినందుకు

యాదగిరిగుట్టకు పాదయాత్ర

కొందుర్గు, జనవరి, 5: షాద్‌నగర్ ఎమ్మెల్యేగా వీర్లపల్లి శంకర్ గెలుపొందడంతో మండల కేంద్రానికి చెందిన బోయ కనకరాజు శుక్రవారం కొందుర్గు నుంచి యాదగిరిగుట్టకు పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యేగా గెలుపొందితే పాదయాత్ర ద్వారా యాదగిరిగుట్టకు వచ్చి మొక్కు చెల్లించుకుంటానని ఎన్నికల సమయంలో దేవుడికి మొక్కుకున్నానని తెలిపారు. శంకర్ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో కాంగ్రెస్ కార్యాలయం నుంచి పాదయాత్రగా బయలుదేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కందుకంల రాములు గౌడ్, జిబి కృష్ణ, బినరేందర్, సి కృష్ణయ్య, రాయికంటి రామస్వామి, ఆర్‌శ్యాంకుమార్, బి శ్రీను, జె ప్రవీణ్, దిలిప్‌చంద్ర, మల్లేష్, బి పాండు తదితరులు పాల్గొన్నారు.


యాదగిరి గుట్టకు పాదయాత్రగా బయలుదేరిన కనకరాజు, పాల్గొన్న నాయకులు

బ్రాహ్మణ అర్చక పురోహిత సమాఖ్య అధ్యక్షుడిగా రవిశర్మ


బ్రహ్మణ అర్చక పురోహిత సమాఖ్య నూతన కార్యవర్గం

షాద్‌నగర్‌అర్బన్, జనవరి 05: షాద్‌నగర్ బ్రాహ్మణ అర్చక పురోహిత సమాఖ్య నూతన కార్యవర్గాన్ని సభ్యులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.రవిశర్మ, ప్రధాన కార్యదర్శిగా వెలగపూడి రంఘునాథశర్మ, కోశాధికారిగా కోచగంటి భానుశర్మ, ఉపాధ్యక్షుడిగా ముచ్చర్ల రఘునాథ్‌శర్మ, సహాయ కోశాధికారిగా రాజశేఖర్‌శర్మ, సహాయ కార్యదర్శిగా మధుసూదనాచార్యలు, మీడియా ప్రతినిధిగా విట్టపు ప్రవీణ్‌శర్మలను ఎన్నుకున్నారు. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు రామ సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన యాచారం

యాచారం, జనవరి 5 : మండల కేంద్రం శ్రీ అయ్యప్పస్వామి నామస్మరణతో మారుమోగింది. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ తిరుమలేశుని ఆలయం కింద శ్రీ అయ్యప్పస్వామి ఇరుముడి మహాపడి పూజ అంగరంగ వైభవంగా జరిగింది. వివిధ గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఉరేసుకొని గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య

శంషాబాద్‌రూరల్, జనవరి 5 : గుర్తుతెలియని యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. దాదాపు 25 ఏళ్ల వయస్సు కలిగిన ఓ యువకుడు మండల పరిధిలోని గండిగూడ సమీపంలో గల ఆటోనగర్‌లో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాంతో వారు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి సంబంధించిన ఎలాంటి సమాచారం అందలేదు. ఇది హత్యానా? లేదా ఆత్మహత్యానా? కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని రైతు దుర్మరణం

యాచారం, జనవరి 5 : ఎరువులను కొనుగోలు చేయడం కోసం వెళుతున్న ఓ రైతును ఆర్టీసీ అద్దె బస్సు ఢీ కొట్టడంతో మృతిచెందిన ఘటన శుక్రవారం మాల్‌లో జరిగింది. కందుకూరు మండలం జబ్బార్‌గూడ గ్రామానికి చెందిన ఎన్. రాంరెడ్డి (65) యాచారం మండలంలోని నందివనపర్తిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసుకునేందుకు తన ద్విచక్ర వాహనంపై మాల్‌కు వెళుతుండగా వెనక నుంచి వచ్చిన దేవరకొండ డిపోకు చెందిన టీఎస్ యుఏ 8484 నెంబర్ గల ఆర్టీసీ అద్దె బస్సు అతివేగంతో వచ్చి రాంరెడ్డి వాహనాన్ని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సు డ్రైవర్ పరారయ్యాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సైదయ్య చెప్పారు. కాగా మృతుడికి భార్యతో పాటు కుమార్తె కౌసల్య, కుమారులు సంజీవ రెడ్డి, సతీష్‌రెడ్డి ఉన్నారు.

గుండెపోటుతో విదేశీ మహిళ మృతి

శంషాబాద్, జనవరి 5 : గుండెపోటుతో ఓ విదేశీ మహిళ మృతిచెందిన సంఘటన శుక్రవారం ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బల్గేరియా దేశానికి చెందిన సారామోవ్ సెర్గీ జెలెవ్, సారామోవ్ సెర్గీ అంటోనేంటా అనే భార్యభర్తలు ఈ నెల శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అనంతరం వారు అక్కడి నుంచి నందిగామలో ఉన్న కన్హా శాంతివనం ధ్యాన మందిరానికి వెళ్లారు. అక్కడ ధ్యానం చేసుకుని తిరిగి శంషాబాద్‌కు చేరుకుని ఓ లాడ్జిలో దిగారు. విశ్రాంతి తీసుకునే సమయంలోనే సారామోవ్‌కు గుండెపోటు వచ్చింది. తన భర్త డయల్ 100 కాల్ చేయగా పోలీసులు వచ్చి శంషాబాద్‌లోని ఓప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. మృతదేహన్ని వారి దేశానికి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని మహిళ..

శంషాబాద్, జనవరి 5 : అనుమానాస్పద స్థిలో గుర్తుతెలియని మహిళ మృతిచెందిన ఘటన శుక్రవారం ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని ఎయిర్‌పోర్టు బావర్చి హోటల్ ఎదురుగా ఫ్లైఓవర్ కింద దాదాపు 25 సంవత్సరాల వయస్సు గల ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిందని సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. ఆమె ఒంటిపై బ్రింజాల్ టాప్, వైట్ కలర్ లెగ్గిన్ ఉన్నట్లు తెలిపారు. ఎవరైనా తెలిసినవారు ఉంటే ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి కిందపడి యువకుడు..

షాబాద్, జనవరి 5 : బైక్ అదుపుతప్పి యువకుడు మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంకేపల్లిగూడ గ్రామంలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ యాదయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంకేపల్లిగూడకు చెందిన మలే రాఘవేందర్‌గౌడ్(21) గురువారం రాత్రి నాగర్‌గూడ నుంచి బైక్‌పై ఇంటికి వెళుతుండగా అతి వేగంగా నడపడంతో భారత్ గ్యాస్ గోదాం వద్ద డివైడర్‌కి తగలడంతో కిందపడ్డాడు. చాతిలో బలమైన గాయం తగిలడంతో కుటుంబసభ్యులు షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి శ్రీశైలంగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం


కావేరి (ఫైల్)

శంషాబాద్‌రూరల్, జనవరి 5 : ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన శుక్రవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని శంకరపూరం గ్రామానికి చెందిన కడ్డాల కావేరి ఈ నెల 4న తన కూలి పనికి వెళ్లగానే ఉదయం శంషాబాద్ కూరగాయల మార్కెట్‌కు వెళ్లింది. సాయంత్రమయినా ఆమె ఇంటికి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద ఎంత వెతికిన ఆచూకీ లభించకపోవడంతో ఆమె తల్లి శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బెల్టు షాపులపై దాడులు

● మద్యం బాటిళ్లు స్వాధీనం

శంషాబాద్‌రూరల్, జనవరి 5 : ననాజీపూర్‌లోని ఓ కిరాణషాప్‌లో అనుమతి లేకుండా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేసి మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ఎస్సై భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. నవాజీపూర్ గ్రామానికి చెందిన ఎడ్ల మహేందర్ అనే వ్యక్తి మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో తోటి సిబ్బందితో అక్కడి వెళ్లి పరిశీలించగా యాభై వేల రూపాయల విలువైన బీరు బాటిళ్లు, ఫుల్, ఆఫ్, క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసున్నామని ఎస్సై తెలిపారు. పట్టుబడిన మద్యం బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

షాబాద్, జనవరి 05 : కుర్వగూడ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేస్తామని పూర్వవిద్యార్థులు దాదె మహేష్, రామకృష్ణ, ఆనంద్, ప్రవీణ్, నవిత అన్నారు. శుక్రవారం గ్రామంలో పాఠశాలకు రెండు సీలింగ్ ఫ్యాన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు రాక మూతపడేస్థాయికి వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాము చదువుకున్న పాఠశాలను బలోపేతం చేసి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. హెచ్‌ఎం ధనలక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకారం అభినందనీయం

శంకర్‌పల్లి, జనవరి 5 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమని సర్పంచ్ అశ్వినిసుధాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని దొంతాన్‌పల్లిలోని ఐబీఎస్ కళాశాల విద్యార్థులు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు రంగులు వేసి, గోడలపై బొమ్మలు గీసి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేశారు. ఇక్ఫాయ్ ఫౌండేషన్ నిధులు సమకూర్చగా ప్రతీ శుక్రవారం గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు తీసుకుంటున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ

షాద్‌నగర్‌రూరల్, జనవరి 5: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులు ఆంగ్లంలో ప్రావీణ్యం పొందాలనే ఉద్దేశంతో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్స్ ఇన్ నీడ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు డాక్టర్ గీతా థామస్ దంపతులు విద్యార్థులకు ఉచితంగా నిఘంటువులను పంపిణీ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల పాఠశాలతో పాటు పలు పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం నిఘంటువులు పంపిణీ చేశారు. షాద్‌నగర్ కేంద్రంగా సేవా కార్యక్రమాలు చేస్తున్న వీరు 11వేల మంది విద్యార్థులకు నిఘంటువులను పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు.


షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులతో డాక్టర్ గీతా థామస్ దంపతులు